# కొత్త నిర్ణయాలు

“ఏమే లేచేదుందా?”

ఉదయం ఏడు గంటలయినా విజయ పక్కమీద పడుకునేఉంది. తల్లి అరుపులను పట్టించుకో లేదు. నిద్ర పట్టక మసలుతూనే ఉందిగాని, లేవాలనిపించలేదు ఆమెకు. పక్కమీద పడుకుంటే బోల్డన్ని ఆలోచనలు వస్తాయి విజయకు. ‘రోజూ ఉదయం ఈత నేర్చుకుంటే? ఆ అమెరికా అమ్మాయి ఎవరో ఆమె లాగా తనూ ఒలంపిక్స్‌లో ఫస్టున రావచ్చుగా? ఆ పిల్లకీ పద్దెనిమిదేళ్ళేనట! తన వయసే. తన వల్ల మాత్రం ఎందుకు కాదు? వెధవది ఇండియాలో స్విమ్మింగ్ పూల్స్ అందరికీ అందుబాటులో లేవు కానీ తను మాత్రం ఆ పిల్ల కంటే ఏం తక్కువ? ఆ పిల్లెవరో గాని వందమీటర్లు పది సెకండ్లలో పరుగెత్తిందంట! తనయితే ఎనిమిది తొమ్మిది సెకండ్లలో పరుగెత్త లేదూ? అంతా ప్రాక్టీసులో ఉంది. గట్టిగా కృషి చేస్తే సాధించలేనిదేముంది! తను ఇన్నేళ్ళూ పాడు క్లాసు పుస్తకాలు చదువుకుంటూ జీవితం వృథాగా గడిపింది.’ అలా ఆలోచిస్తూంటే ఓ క్షణం ఆమెను నిస్పృహ ఆవరించింది.

‘ఇప్పటికీ మించిపోయింది లేదు. బెటర్ లేట్ దేన్ నెవ్వర్. తను ఏదయినా చెయ్యాలి. కనీసం సైకిలుతొక్కటం కూడా తను నేర్చుకోలేదే! జీవితం వృథా!’ అనుకుంది విజయ.

ఇలా విజయ పెద్దపెద్ద ఆలోచనలు చేస్తూ, ఊహల ఆకాశంలో శరీరాన్ని జిమ్నాస్టిక్ పల్టీలు కొట్టిస్తుండగా, వాళ్ళమ్మ సులోచన, “ఏమే లేచేదుందా? ఇవాళ భోగి. పండగ పూట ఆ నిద్రేమిటే! ఏడున్నరవుతోంది. ఇంక లే” అని పెద్దగా అరవటంతో పై నుండి కింద పడ్డట్టయింది ఆమెకు.

‘ఛీ, ఛీ! అమ్మ ఎప్పుడూ ఇంతే. మూడ్ చెడగొడుతుంది’ అని విసుక్కుంది విజయ.

ఇక తప్పదనుకుంటూ లేచింది ఆమె. బెడ్‌రూం వదలి బయటకొచ్చింది. తల్లి హాలు కడుగుతోంది. ముఖం మీద చిరుచెమట, చెదరిన బొట్టు, రేగిన జుట్టు. తడిసిన

చీరె కొంగుల్ని బొడ్లో దోపుకుని ఇల్లు కడుగుతున్న తల్లిని ఆ అవతారంలో చూసి ఒళ్ళు మండిపోయింది విజయకు.

"ఏమిటమ్మా ఆ అవతారం! పొద్దున్నే ఇంత పని పెట్టుకోక పోతే ఎవడేడ్చాడు" అంది విజయ.

"పండగ పూట కూడా ఇల్లు కడక్కపోతే ఎట్లా? నువ్వు వీసమెత్తు సాయం చెయ్యవు! నేను చేసుకోక పోతే నీ అమ్మ మొగుడు చేస్తాట్టే" అంది సులోచన.

"అమ్మడూ! పొద్దున్నే మీ అమ్మతో పేచీ పెట్టుకోకమ్మా, మన్ని బతకనివ్వదు" చెవిలో ఐ-పాడ్ పాటలు వింటూ, భార్య కేకలు తన దృష్టిని భగ్న పరచగా అన్నాడు, ఆమె అమ్మ మొగుడు.

"మీ తండ్రీ కూతుళ్ళలాగా కలలు కంటూ పడుకుంటే నా కెలా గడుస్తుందీ పండగపూట!" అని కూతురి వంక తిరిగి, "ఆ పాచి ముఖం కడిగి కాఫీ తాగిరా. చాక్ పీసుతో ముగ్గులేద్దుగాని. మీ నాయనక్కూడా ఓ కప్పు ఇవ్వు. పాపం! ఎన్నిసార్లు ఇచ్చినా వద్దనడు మనిషి!"

"నా వల్ల కాదు. నువ్వేసుకో" అంది విజయ విసుగ్గా.

"చీపురు తిరగేస్తాను. పండగ పూట నా చేతిలో తిట్లు తినకు."

"పసి పిల్ల! ఎన్ని పనులు చేస్తుంది. అదే కాఫీ కలపాలి, అదే ముగ్గులేయాలి! !" అన్నాడు పిల్ల తండ్రి ప్రభాకరం.

"పరాయమ్మ కన్న పిల్ల చేస్తుంటే నీకు చీమ కుట్టినట్టు లేదు. అంతగా కూతురు చేస్తుంటే సహించలేకుంటే, నువ్వేద్దువుగాని, ముగ్గు బుట్ట తీసుకురా మగడా" అంది సులోచన మొగుడితో.

ఆ మాటతో మొగుడు గదిలోకీ, కూతురు బాత్‌రూంలోకీ దూరారు. ఫ్లాస్క్‌లో తల్లి పోసి పెట్టిన కాఫీని రెండు కప్పుల్లో ఒంపి, తండ్రి కొకటి ఇచ్చి, తను తాగి, తల్లి చేత మరోసారి చెప్పించుకుని, ముగ్గు వేసే కిరాతకచర్య చేపట్టింది విజయ.

ఆమె ఆయేడే బి.ఇ. (సివిల్ ఇంజనీరింగ్) లో చేరింది. ముగ్గేయటానికి పెద్ద స్కేలూ, సెట్ స్క్వేరూ వగైరా సామగ్రి చేత ధరించి ఆయత్త మయింది.

"ఏంవిటే, ఈ ప్రయత్నమంతా, ముగ్గేయటానికే?" అంటూ హాల్లో కదుగెట్టాడు, జాగింగ్ కెళ్ళి ఇంటికి తిరిగొచ్చిన ఆమె అన్న రామ్మోహన్.

"నీకెందుకూ, నీ పని నువ్వు చూసుకో ఫో" అంది విజయ కోపంగా.

"ముగ్గెయ్యటానికి నీ ఇంజనీరింగ్ తెలివిలేటలక్కర్లా. అమ్మ నడుగు చెప్తుంది."

"నాకు తెల్సులేరా! నేను వేసేది పాతకాలం ముగ్గుకాదు. అద్భుత కళాఖండం!"

"అమ్మ బాబో! ప్రమాదం పొంచి ఉందన్నమాట! మా స్నేహితులనందర్నీ ఇంటికి రావద్దని ఫోను చేస్తాను" అంటూ నిష్క్రమించాడు రామ్మోహన్.

విజయ ఇంజనీరింగ్ పరికరాలూ, తన మేధస్సూ రంగరించి ముగ్గు వేయటం ప్రారంభించి, రకరాలషేపుల్లో వచ్చిన ఏ ముగ్గూ ఆమెకు నచ్చక చెరిపేసి, మళ్ళా ప్రయత్నించి యత్నించి, తల ప్రాణం తోకకొచ్చిన పరిస్థితిలో చివరికో ముగ్గు వేశానని పించింది.

అది పూర్తయిన తరుణంలో తండ్రి వచ్చి చూశాడు. "నీకు తృప్తి కలుగలేదు కదా, అమ్మదూ?" అని అడిగాడు ఆమె దీన వదనం వంక చూస్తూ.

విజయ తలూపింది. కళ్ళనీళ్ళే తక్కువ.

"కళాకారుడికి తృప్తి కలుగకూడదు. అలా కలిగిన క్షణం అతడిలో కళ చచ్చి పోయినట్లే. తను పూర్తి చేసిన ఏ చిత్రాన్ని చూసీ కళాకారుడికి తృప్తి కలుగదు. ఇంకేదో చేయాలన్న ఆరాటంతో అతని మనస్సు ఉద్విగ్నమైఉంటుంది.".

"నా శ్రాద్ధమై ఉండదూ? అది చేసిన తప్పుడు పన్లన్నింటినీ సమర్ధిస్తూ మీరు దాన్ని చెడగొడుతున్నారు! ఏవిటే ఆ ముగ్గు! నీకు చెప్పేకంటే నేను చేసుకోటం నయం!" అంది, తల్లి, అప్పుడే హాల్లోకి వస్తూ.

"నాకీ ఆడ పన్లు చేతకావు. బాగుండకపోతే నువ్వేసుకో."

"చంపుతా! నువ్వు ఆడదానివి కావటే? రేపు పెళ్ళిచేస్తే అత్తారింట్లో కాపురం చెయ్యాల్సి పిల్లవు! నీకే పనీ చేత కాకపోతే తల్లి ఏం నేర్పలేదని నలుగురూ నన్నంటారు!"

తల్లి మాట విన్పించుకో లేదు విజయ. "డాడ్! నాకు బండెప్పుడు కొనిస్తావు. రోజూ కాలేజీకి బస్సులో వెళ్ళేప్పటికి నా ఒళ్ళు హూనమై పోతున్నది" అంది గారం కుదుస్తూ విజయ.

"ముందే సైకిల్ తొక్కటం నేర్చుకోమన్నానా? సైకిలొచ్చాక స్కూటీ కొనిస్తానని చెప్పానా లేదా?"

విజయ ఇంజనీరింగ్‌లో సీటు సంపాదించాక ప్రభాకరం ఆమెకు స్కూటీ కొనిస్తానని వాగ్దానం చేశాడు. అందుకు ముందుగా సైకిల్ తొక్కటం నేర్చుకోవాలని షరతు పెట్టాడు.

'ఆఁ! అదేం బ్రహ్మ విద్యా, వారం రోజుల్లో నేర్చుకోనూ?' అనుకుంది విజయ. తీరా సైకిలు ఎక్కాక గానీ ఆమెకు తెలియలేదు, తను ఏటిపై వేసిన తాటిపై నిలబడ్డట్టు. గుప్పిట్లో ప్రాణాలు పెట్టుకుని, ఎంత జాగ్రత్తగా తొక్కుతున్నా ననుకున్నా, అన్న ఊతగా పటుకున్నా చాలసార్లు కింద పడింది. రామ్మోహన్ "నేను పట్టుకునే ఉన్నాను. భయపడకు" అని భరవాసా ఇచ్చినా ప్రయోజనం లేక పోయింది. రామ్మోహన్‌కి విసుగొచ్చి, "ఏమైనా అడుగు గానీ, సైకిలు నేర్పమని మాత్రం అడక్కు" అని భీష్మించుకున్నాడు. ఆ తరాత్ర విజయ ఏంసెట్ కోచింగ్‌లలో పడి సైకిలు నేర్చుకునే కార్యక్రమాన్ని వాయిదా వేసింది.

"ఈ కొత్త సంవత్సరంలో కొత్త నిర్ణయం తీసుకున్నాను, డాడ్! రేపటి నుండి రెగ్యులర్‌గా ప్రాక్టీసు చెయ్యాలనుకుంటున్నాను" అని చెప్పింది విజయ దృఢంగా.

అప్పుడే హాల్లోకి ప్రవేశించిన రామ్మోహన్, "కొత్త సంవత్సరం వచ్చి పది రోజులు దాటి పోయింది. న్యూ ఇయర్ రిజల్యూషన్స్ తీసుకోటం ఇప్పుడా?" అన్నాడు.

"ఎప్పుడైనా తీసుకోవచ్చు. పైగా రేపు సంక్రాంతి. మంచిరోజు" అందివిజయ.

"హుం, నేను ముసలమ్మ నయ్యే వరకు నువ్వు సైకిలు నేర్చుకుంటూనే ఉండు" అంది సులోచన.

"ఇప్పుడు నువ్వు మహా పడుచమ్మవయినట్టు! ఏమైనా నేను సైకిలు నేర్చుకు తీర్తాను."

"మా బాగా చెప్పావు!" అని కూతుర్ని ప్రశంసించాడు ప్రభాకరం.

"అది సరే, నన్ను మాత్రం నేర్పమని అడక్కు" అని ముందు జాగ్రత్త పడ్డాడు రామ్మోహన్.

"నా కోడీ, కుంపటీ లేకపోతే తెల్లారదన్నాడట ఎవడో! బాలూ నేర్పుతానన్నాడు."

బాలేంద్ర పక్కింటి వాళ్ళబ్బాయి. ఎస్సెస్సీ చదువు తున్నాడు. "అక్కా నేను నేర్పుతాగా, నువ్వు భయపడకు" అని అతడు ఆమెకు వాగ్దానం చేశాడు.

"మంచి నిర్ణయం తీసుకున్నావమ్మడూ! గుడ్ ప్రొసీడ్" అని ప్రభాకరం కూతుర్ని ప్రోత్సహించాడు.

మర్నాడు పొద్దున్నే ఆరు గంటలకల్లా దీక్ష పట్టి నిద్ర లేచింది విజయ. కాఫీ తాగి సైకిలు వధ పట్టటానికి బాలేంద్ర కోసం ఎదురు చూస్తూ కూర్చున్నది. అయితే బాలుకు విజయ కున్నంత దృఢ మనస్తత్వం, కృతనిశ్చయం లేవు. తీరుబాటుగా ఏడుంపావుకు వచ్చాడు. వచ్చినవాడు వెంటనే తన కర్తవ్యాన్ని నిర్వహించవచ్చు కదా! అహఁ, తను మాథ్స్ ట్యూషనుకు వెళ్ళాలన్నాడు.

విజయకు ఒళ్ళు మండుకు పోయింది. అయినా నిగ్రహించుకుంటూ, "చూడు బాలూ! ఇలా మాట తప్పటం బాగాలేదు. నువ్వు ట్యూషనుకు వెళ్ళి నేర్చుకునేదేమయినా ఉందా? అసలు ప్రతిరోజూ వెళ్ళాలా? నీలాంటి తెలివిగల పిల్లవాడికి ట్యూషన్లెందుకు?..."

"మా పేరెంట్స్..."

"నిజమే, పేరెంట్స్ తెలీక కొప్పడ్తారు. నాకు తెలుసు- ఆ ట్యూషను మాష్టరూ నువ్వు రాలేదని అఘోరిస్తాడు. కనుక, నాల్రోజులకోసారి ఆయనకు కనపడు. ట్యూషన్లు చదివినందువల్ల ఒరిజినల్ తెలివితేటలు మందగించటం తప్ప మరో ప్రయోజనం లేదు" అని గీతా బోధ చేసింది విజయ బాలూకు.

వాడొట్టి అర్భకం సన్నాసి! ప్రతిఘటన తెలియని వాడు. "కానీ అక్కా!..." అని నసిగాడు.

"నీ ముఖం! నీకు ఏమన్నా తెలీకపోతే నన్నడుగు, చెప్తాను. ఇవ్వాళ మాత్రం నువ్వు సైకిలు నేర్పాల్సిందే. నువ్వు రయ్యిమని సైకిలు తొక్కుతుంటే మన వీధిలో జనం ఎంత ముచ్చట పడ్తారనుకున్నావు! తొక్కటంలో అంత నైపుణ్యం ఉన్నవాడివి, నేర్పించటంలోనూ అంత ప్రతిభ ఉన్నవాడివే. ఇది నేన్న మాట కాదు. మన కాలనీ జనాలు ఏకగ్రీవంగా సెలవిచ్చిన మాట!" అని ఉబ్బేసింది విజయ తన రాజకీయ చతురత నుపయోగిస్తూ.

పొగడ్తకు ఉబ్బని వాళ్ళెవరుంటారు ఈ ప్రపంచంలో! ఆ భోలాశంకరుడికి కూడా ఉంది కదా ఆ వీక్‌నెస్! ఇంక పిల్లవాడయిన బాలేంద్ర అనగా ఎంత?

"సరేనక్కా..! నువ్వంత హామీ ఇచ్చాక వెధవ ట్యూషన్లెందుకు. నీ దగ్గరే చదూకుంటాను. పద, సైకిలు కూడ తెచ్చాను" అన్నాడు.

ఇద్దరూ పక్కనున్న మునిసిపల్ గ్రౌండుకు వెళ్ళారు. విజయని సైకిలు మీద కూర్చో పెట్టాడు బాలూ. ఆమె తొక్క సాగింది. పావుగంట బండిని పట్టుకుని ఆమెకు నేర్పాక సైకిలు వదిలేశాడు. బాలెన్స్ తప్పి ఆమె పడిపోయింది. మళ్ళా సైకిలు ఎక్కాలంటే ఆమెకు భయమేసింది.

"ఇంకా ఐదారుసార్లయినా పడకపోతే సైకిలు రాదక్కా! నాకయితే కాల్చిప్పలు, మోచిప్పలు లేచిపోయాయి. అలా నేర్చుకున్నాను కనుకే ఇవాళ ఇంత వాడినయాను" అని ఆమెకు ధైర్యం పలికాడు బాలూ.

అలా బాలూ ప్రోత్సాహంతో సైకిలెక్కి రెండు మూడు సార్లు కింద పడింది. పడిన ప్రతిసారీ తనకు సైకిలు తొక్కటం వచ్చేస్తున్నదని సంబరపడిపోయింది విజయ.

కింద పడినప్పుడల్లా, "నాకు సైకిలు తొక్కటం వచ్చేస్తోంది కదురా, బాలూ!" అని అడిగేది.

"ఆల్మోస్ట్ వచ్చేసినట్టే, అక్కా!" అని నమ్మబలికాడు బాలేంద్ర.

అయితే మళ్ళీసారి పడినప్పుడు జరగవల్సిన ఘోరం జరిగిపోయింది. సైకిలు పడకుండానే తను పడిపోతాననే భయంతో హాండిల్‌బార్ వదిలేసింది. కాళ్ళు కిందపెట్టి కిందకు దిగుదామనుకుంది. సైకిలు ముందుకు పోయింది. ఆమె పడిపోయింది. కాలు మెలిక పడింది. ఎడమకాలు సీలమండ దగ్గర బెణికింది. మోకాలు చిప్ప ఊడినంతగా గాయమయింది. చూడీదార్ మోకాలు దగ్గర చిరిగి పోయింది.

"అయ్యో, అమ్మో, చంపేశావుకదరా బాలూ!" అని ఏడవటం మొదలెట్టింది విజయ.

పాపం, బాలేంద్ర కూడ ఆమె పరిస్థితికి నొచ్చుకున్నాడు. "అందుకేనక్కా, నేను ఆడపిల్లలకు నేర్పంది. వాళ్ళు ఏమాత్రం ఓర్చుకోలేరు. నా అంత దానివి కావాలంటే ఇలాంటి దెబ్బలు సహించక తప్పదు" అన్నాడు.

అయితే విజయకు 'అంతయే' ఇచ్ఛ నశించింది. లేవలేక అలాగే కూలబడిపోయింది. బాలు వచ్చి లేపాడు. మెల్లగా ఆమెను నడిపిస్తూ ఇంటికి తీసుకువచ్చాడు.

విజయను చూస్తూనే సులోచన ఆరున్నొక్క రాగం మొదలెట్టింది. "అయ్యో! కాలు విరిగి పోయింది గావల్ను! ఈ దరిద్రపు సైకిలు తొక్కటం ఎందుకువచ్చిందో నాయనో, పండగపూట ఈ అరిష్టం ఏమిటి బాబో! కాలు బాగవుతుందో, లేదో, ఈ కుంటిదాన్ని ఎవడు చేసుకుంటాడండీ" అని విలపించ సాగింది సులోచన.

"ఉండవే అమ్మా! కాలు విరిగి నేనేడుస్తుంటే, ఇప్పుడు నీకు నా పెళ్ళి సంగతి పట్టుకుంది" అని మూలుగుతూ విసుక్కుంది విజయ.

ప్రభాకరం డాక్టర్ని తీసుకు రమ్మని కొడుకుని తరిమి, "నెప్పిగా ఉందా విజ్జీ?" అని అడిగాడు.

"అవున్నాన్నా! ప్రాణం పోతున్నంత బాధగా ఉంది" అందామె ఏడుస్తూ.

ఇదంతా చూస్తూ బిక్క చచ్చిపోయి నిలబడ్డాడు బాలేంద్ర. ఇంక జన్మలో ఆడపిల్లలకు సైకిలు నేర్పకూడదని తీర్మానించుకున్నాడు.

డాక్టరు రెండిళ్ళ అవతలే ఉంటాడు కనుక ఆయన రావటంలో ఆలస్యమేం జరగలేదు.

కాలు పరీక్ష చేశాక, "జస్ట్ స్ప్రెయిన్! మోకాలు చర్మం గీరుకుపోయి రక్తం వచ్చింది అంతే" అన్నాడు.

"అయితే, కాలు ఫ్రాక్చరు కాలేదా, డాక్టరుగారూ!" అడిగాడు ప్రభాకరం.

"ఫ్రాక్చరా, పాడా! రెండు రోజులు ఇంజెక్షనులు తీసుకుంటే గాయం, బెణుకు కూడ తగ్గి పోతాయి. ఎందు కయినా మంచిది ఎక్స్‌రే తీయిద్దాం. ఆర్థోపెడీషియన్ ఒపీనియన్ కూడ తీసుకోటం మంచిది" అని ఇంజెక్షను చేసి, ఓ అరడజను మందులు రాసి, విజిటింగ్ ఫీజు రెండొందలు పుచ్చుకుని వెళ్ళాడు, డాక్టరు.

తన్ను ఎవ్వరూ ఏమననందుకు బతుకు జీవుడా అనుకుంటూ నిష్క్రమించాడు బాలేంద్ర.

ఆ సాయంంత్రానికి ఎక్స్‌రే తీయించుకుని, ఆర్థోపెడీషియన్ ఒపీనియన్ కూడ తీసుకున్నాక అతడు కూడ ఫ్రాక్చరు కాలేదని నిర్థారణ చేశాక వాళ్ళు ఊపిరి పీల్చుకున్నారు.

"ఫ్రాక్చరు కాలేదన్నమాట! నేనూ అదే అనుకున్నాను. అమ్మే అనవసరంగా గాబరా పెట్టింది" అంది విజయ మెల్లగా బెడ్ మీద లేచి కూర్చుంటూ.

"అహహఁ లేవక పడుకో. ఇవాల్టికి పెద్ద ప్రమాదం తప్పింది. ఆ ఏడుకొండలవాడికి ముడుపు కడతాను. వాడి దయ వల్లే పిల్ల ప్రమాదం లేకుండా బయటపడింది" అంది సులోచన.

ఆడపిల్లలకు కన్నొంకరా, కాలొంకరా వుంటే పెళ్ళి కావటం కష్టం కనుక కూతుర్ని వారం రోజులు బెడ్ మీద నుండి లేవనివ్వ లేదు సులోచన. వారం తర్వాత గాయం మాను పట్టి, కాలు స్వాధీనమై కాలేజీకి వెళ్ళగలుగుతున్నా, మళ్ళా సైకిలు ముట్టుకోవాలంటే భయమేసింది విజయకు. కూతురి కాలి వైద్యానికి భారీగానే ఖర్చవటంతో కూతుర్ని సైకిలు నేర్చుకోమని ప్రోత్సహించలేక పోయాడు ప్రభాకరం.

"మళ్ళా సైకిలు మాట ఎత్తావంటే వాత పెడ్తాను" అన్నది సులోచన.

బాలేంద్ర మళ్ళా మొహం చూపించలేదు.

సైకిలు నేర్చుకోలేక పోయానని విజయ కించ పడుతుంటే, ప్రభాకరం ఆమెకు ధైర్యం చెప్పాడు.

"నీకు సైకిలు గోల ఎందుకు, అమ్మడూ? కారు నడపటమే నేర్చుకుందువు గాని. కారు మీద వెళ్ళాలని నుదుటి మీద రాసుంటే, సైకిలు ఎలా నేర్చుకుంటావు!" అన్నాడు.

"అది నిజమేలే నాన్నా! రోడ్డు మీద నడిచే జనాల రాతే బావుండి ఉండదు" అన్నాడు రామ్మోహన్.

"చూడు నాన్నా! అన్నయ్య నేనంటే కుళ్ళుకు పోతున్నాడు. రేపు ఫస్టు నుండి కారు డ్రైవింగ్ నేర్చుకుంటాను" అంది విజయ.

"మరో న్యూ రిజొల్యూషనా తల్లీ? ఇలా యేడాది పొడుగూతా నిర్ణయాలు తీసుకుంటూ మా ప్రాణాలు తీయకు" అన్నాడు రామ్మోహన్. విజయకు అన్న మాటలో నిజమే కన్పించింది.

'తను ఇలా ఎన్ని కొత్త నిర్ణయాలు తీసుకోలేదు! ఈదటం నేర్చుకుందామనుకుంది, రన్నింగ్ ప్రాక్టీసు చేద్దామనుకుంది, యోగాసనాలు చెయ్యాలనుకుంది. ఒక్క శవాసనం తప్ప మరేం వేయలేక పోయింది. చివరకు సైకిలు తొక్కటంలో కూడ విఫలమైంది. ఎన్ని మంచి నిర్ణయాలు తీసుకుంటే మాత్రమేం ప్రయోజనం, ఆచరణలో పెట్టలేక పోయాక' అనుకున్న విజయకు నీరసం, నిస్త్రాణ ఆవరించాయి.

"ఇంక నేనేం కొత్త నిర్ణయం తీసుకోను నాన్నా! ఆచరణలో పెట్టలేని నిర్ణయాల వల్ల ప్రయోజనమేంలేదు" అంది నిరాశగా విజయ.

"అదే తప్పు. చేసుకున్న నిర్ణయాలు ఆచరణలో పెట్టలేదని అసలు నిర్ణయాలే తీసుకొనక పోవటం పెద్దపొరపాటు. అసలు కొత్త నిర్ణయాలు తీసుకొనటంలోనే మనిషి పరిపూర్ణత వైపుగా సాగుతున్నాడన్న సంకేతానికి సూచన. చిన్నతనంలో తీసుకునే నిర్ణయాలు హిమాలయాలంత ఎత్తున ఉంటాయి. నిజానికి హిమాలయ సందర్శనమే గొప్ప అనుభవం కదా! వాటిని అధిగమించ లేక పోయామే అని బాధ పడటమెందుకూ? కలల్లో బతగ్గలగటం ఓ వరం. కలలన్నీ నిజమవుతాయా? మనిషి పెరుగుతున్న కొద్దీ అతను తీసుకునే నిర్ణయాలు ఆచరణాత్మకంగా ఉంటాయి. కనుక ప్రతియేటా కొత్త నిర్ణయాలు తీసుకోవాల్సిందే, వాటిని అమలు పర్చ ప్రయత్నించాల్సిందే. అందులో విఫల మయ్యామని అసలు నిర్ణయాలే తీసుకోక పోవటం జీవితం పట్ల ఔదాసీన్యం వహించట మవుతుంది" అన్నాడు ప్రభాకరం.

తండ్రి మాటతో విజయకు అశ్వాసన లభించింది. స్విమింగ్, రనింగ్, జాగింగ్, సైక్లింగ్ ప్రాక్టీసుల మాట తలపెట్టటం మానేసి కారు డ్రైవింగ్ నేర్చుకోవాలన్న కొత్త నిర్ణయం తీసుకున్నాక, విజయ శారీరిక, మానసికారోగ్యాలు బొద్దుగా పెరిగాయి. రాబోయే ఉగాది క్కూడ కొత్త నిర్ణయమేదయినా తీసుకోవాలన్న ఆలోచనలో ఉందామె. 'ఇప్పుడు బాలు తనతో మాట్లాడటమే మానుకున్నాడు. తనతో మాట్లాడకూడదన్న నిర్ణయమేం తీసుకో లేదు కదా వాడు!' అనుకుంది ఆమె.

ఈ వారం (రాజకీయ సామాజికార్థిక వార పత్రిక, జూన్ 6-12, 2010.)